

హెచ్‌సీపై దాడి చేసిన ఇద్దరిపై రౌడీషీట్

శ్రీకాకుళం క్రైం: ఈ నెల 8న రాత్రి నగరంలో గస్తీలో విధులు నిర్వహిస్తున్న కనకరాజు అనే హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన మెండ నారాయణరావు, అతని సోదరుడు దేవిప్రసాద్‌పై రౌడీషీట్ తెరవనున్నట్టు రెండో పట్టణ సీఐ జి.ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నారాయణరావుపై 2016 వరకు రౌడీషీట్ ఉండేదని, ఆ తరువాత తొలగించినట్లు చెప్పారు. అయినా ఇటువంటి దాడులకు పాల్పడడంతో అతనిపై మళ్లీ రౌడీషీట్ తెరిచేందుకు ఎస్పీకి నివేదిక అందించామన్నారు. ప్రస్తుతం స్టేషన్ పరిధిలో 36 మందిపై రౌడీషీట్ ఉందని తెలిపారు.

పట్టుబడుతోంది..

ఈ నెల 9 ఉగాది నాడు మంచి రోజు అని శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ కుటుంబం తమ కుమార్తె వివాహం కోసం బంగారం కొనుగోలు చేసేందుకు కారులో నరసన్నపేటకు బయలుదేరింది. మడపాం టోల్‌గేట్ వద్ద వారి కారును పోలీసులు తనిఖీలు చేశారు. బ్యాగులో రూ.4 లక్షలు పట్టుబడింది. దీనికి సంబంధించి సరైన పత్రాలను ఆ కుటుంబం చూపించలేకపోయింది. పెళ్లికార్డు సైతం ఇంకా తయారు చేయకపోవడంతో ఎలాంటి ఆధారాలను చూపించలేక పోయింది. దీంతో పోలీసులు ఆ నగదును సీజ్ చేశారు. దీంతో ఆ కుటుంబం ఆందోళన చెందుతుంది.

- ఎన్నికల వేళ భారీగా నగదు స్వాధీనం
- 29 రోజుల్లో రూ.33.66లక్షలు సీజ్
- అవగాహన లేకుండా తరలిస్తున్న ప్రజలు
- ఆధారాలు చూపించలేక ఇబ్బందులు





ఉల్లివలస చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపడుతున్న పోలీసులు (ఫైల్)

(మెళియాపుట్టి)

గత నెల 18 నుంచి ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకూ ఎవరైనా రూ.50వేలకు దాటి నగదు తీసుకెళ్తే సరైన ఆధారాలు చూపాలని ఈసీ స్పష్టం చేసింది. డబ్బు, మద్యం, ఇతర సామగ్రిని అక్రమంగా రవాణా చేయకుండా ఎక్కడికక్కడే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఈ చెక్‌పోస్టుల వద్ద పోలీసులు, ఎన్నికల అధికారులు నిత్యం వాహన తనిఖీలు చేపడుతున్నారు. అయితే, చాలామంది అవగాహన లేక, ఎలాంటి ప్రతాలు లేకుండా డబ్బును తీసుకెళ్తూ పట్టుబడుతున్నారు. 29 రోజుల్లో రూ.31,66,000 నగదును పోలీసులు, ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. ప్రస్తుతం శుభకార్యాలకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెల 18, 19, 20, 21, 26, 27 తేదీల్లో వివాహాలు అధికంగా ఉన్నాయి. జిల్లాలో సుమారు 5వేల పెళ్లిళ్లు జరుగుతాయని అంచనా. గృహ ప్రవేశాలు కూడా ఎక్కువగా జరగనున్నాయి. దీంతో అవసరమైన బంగారం, నగలు, గృహోపకరణాలు, ఇతర సామగ్రిని కొనుగోలు చేసేందుకు చాలామంది డబ్బులతో శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, పాతపట్నం, ఒడిశాలోని పర్లాఖిమిండి తదితర ప్రాంతాలకు వెళ్తూ పోలీసులకు పట్టుబడుతున్నారు. డబ్బులకు సంబంధించి ఆధారాలను చూపించలేకపోతున్నారు. దీంతో నగదు సీజ్‌కు గురవుతుంది. ఈ ఇబ్బందులు పడలేక కొంతమంది ఎన్నికలు ముగిసిన తరువాత డబ్బులు ఇస్తామని వ్యాపారులతో ఒప్పందం కుదుర్చుకుని అవసరమైన బంగారం, ఇతర వస్తువులను తీసుకెళ్తున్నారు.

ఇలా పట్టుబడ్డారు..

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో అన్ని మండల సరిహద్దులతో పాటు ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో చెక్ పోస్టులను అధికారులు ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీలు చేస్తుండడంతో భారీగా నగదు పట్టుబడుతోంది.

- గత నెల 23న సీది జంక్షన్ వద్ద పర్లాఖిమిండి వ్యాపారి నుంచి రూ.1.36 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.
- 26న బత్తిలి- ఆలికాం వద్ద ఓ వ్యక్తి వద్ద రూ.2 లక్షలు పట్టుబడ్డాయి. అదే రోజు ఆమదాలవలస-తిమ్మాపురం జంక్షన్ వద్ద ఒకరి నుంచి రూ.82,820, మరొకరి నుంచి రూ.54 వేలు స్వాధీనం చేసుకున్నారు.
- 29న గార మండలం తూలుగు జంక్షన్ వద్ద ఓ వ్యక్తి వద్ద రూ.4.4లక్షలు పట్టుబడ్డాయి.
- ఈ నెల 1న పలాసలోని గురుడుఖండి వద్ద రూ.1,49,500, పల్లివూరు వద్ద రూ.1,02,350, పోలాకిలో రూ.66 వేలు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 2న జలుమూరు మండలం టెక్కలిపాడు వద్ద రూ.3,01,400, పలాస మండలం రెంటి కోట వద్ద రూ.2.50 లక్షలు పట్టుబడినట్లు అధికారులు తెలిపారు.
- 3న వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి వద్ద రూ.2 లక్షలు సీజ్ చేశారు.
- 7న ఎటువంటి పత్రాలు లేకుండా శ్రీకాకుళం నుంచి నరసన్నపేట కారులో తరలిస్తున్న 12.310 కేజీల వెండి పట్టీలను సత్యవరం జంక్షన్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు.
- 9న పైడిభీమవరం వద్ద రూ.75 వేలు, నరసన్నపేట వద్ద రూ.4 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.
- ఈ నెల 10న నరసన్నపేట నియోజకవర్గంలో రూ.7.30 లక్షలను అధికారులు సీజ్ చేశారు.



నరసన్నపేటలో పట్టుబడిన నగదును లెక్కిస్తున్న ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు (ఫైల్)

ఆధారాలు చూపిస్తేనే..

ఎన్నికల కోడ్ ప్రకారం రూ.50 వేలకు మించి నగదు చెల్లింపులకు పాన్‌కార్డు ఉండాలి. నగదు పట్టుబడితే సరైన పత్రాలు చూపించాలి. లేదంటే నగదును పోలీసులు ఆర్వోలకు అప్పగిస్తారు. రూ.10 లక్షలకు మించి పట్టుబడితే ఆదాయపన్నుల శాఖ అధికారులకు అప్పగిస్తారు. ఆ నగదు తిరిగి తీసుకోవాలంటే ఆధారాలతో కార్యాలయాలకు వెళ్లాలి. దీనికి సంబంధించిన జిల్లా కమిటీ ఆ ఆధారాలను పరిశీలిస్తుంది. అన్ని సక్రమంగా ఉంటే నగదును బాధితులకు అప్పగిస్తారు.

లెక్క చెప్పాల్సిందే..

సరిహద్దులో గట్టి నిఘా ఏర్పాటు చేశాం. ఒడిశా నుంచి వస్తున్నా ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నాం. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం రూ.50 వేలు కంటే అదనంగా నగదు తరలిస్తే లెక్కచెప్పాల్సిందే. లేదంటే సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగిస్తాం. వైద్యం కోసం నగదు తీసుకెళ్తే మెడికల్ బిల్లులు చూపించాలి. సామాన్యులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

-టి.రాజేష్, ఎస్ఐ, మెళియాపుట్టి

హామీ ఇచ్చి.. గాలికొదిలేసి..

- జిల్లాలో కానరాని కోల్డ్‌స్టోరేజ్
- అసంపూర్తిగా జట్టీల నిర్మాణం
- వైసీపీ పాలనలో మత్స్యకారులకు అన్యాయం



(టెక్కలి)

జిల్లాలో కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణం కలగా మిగిలింది. ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకు 193 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉన్నా ఒక్క కోల్డ్‌స్టోరేజ్ కూడా లేకపోవడంపై మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలో వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట, ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వద్ద జట్టీలు నిర్మిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ కూడా అసంపూర్తిగానే మిగిలిపోయింది. జిల్లాలో 104 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. ఇచ్ఛాపురం, సోంపేట, కవిటి, మందస, వజ్రపు కొత్తూరు, సంతబొమ్మాళి, పోలాకి, గార, ఎచ్చెర్ల, రణస్థలం, తదితర మండలాల పరిధిలోని సముద్రంలో 3,584 వరకు బోట్లపై 14,280మంది మత్స్యకారులు వేట సాగిస్తుంటారు. ఇవి కాకుండా మరో 8వేల చిన్నపడవల్లో కూడా వేల మంది మత్స్యకారులు చేపల వేటే జీవనంగా బతుకుతున్నారు. వాస్తవానికి జిల్లాలో తీరప్రాంతం కావాల్సినంత ఉండడంతో మత్స్యసంపద కోకొల్లలు. వంజరం, కోణెం, చందువలు, గులివిందలు, నెత్తళ్లు, మాగలు, కారలు, కలవలు, చిదుములు, తుంబడాలు(టూనా), రొయ్యలు తదితర మత్స్య సంపద లభిస్తుంది. వీటిల్లో టూనా చేపకు ప్రత్యేకత ఉంది. మత్స్యకారులు 300 నాటికల్ మేరకు సముద్రంలోకి వెళ్లి సర్కిల్‌హుక్ ద్వారా సీజన్‌లో టూనా చేపల కోసం వేట చేస్తారు. ఈ చేపలను చైనా, జపాన్, యూకే, ఫ్రాన్స్, జర్మనీ తదితర దేశాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. అయితే, ఇంత మత్స్యసంపద లభిస్తున్నా కోల్డ్‌స్టోరేజ్ నిర్మాణానికి పాలకులు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో విశాఖ ప్రాంతాల నుంచి దళారీలు వచ్చి తక్కువ ధరకు చేపలను కొనుగోలు చేస్తుండడంతో మత్స్యకారులు నష్టపోతున్నారు.

బుడగట్లపాలెంలో 40 ఎకరాల స్థలంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ.332.09 కోట్లతో అప్పట్లో విశ్వసముద్ర టెండర్లు దక్కించుకుంది. వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ సంస్థ కొన్నాళ్ల పాటు సర్వే కూడా చేసింది. ఇక్కడ ఫిషింగ్ హార్బర్ నిర్మాణం జరిగితే రూ.786కోట్లు ల్యాండింగ్ చేసుకునే అవకాశం, పదివేల మంది మత్స్యకారులకు ఉపాధి, రోజుకి 26వేల మెట్రిక్ టన్నుల వరకు చేపల వేట సాధ్యమని అప్పట్లో సర్వే సంస్థలు భావించాయి. అయినా పనులకు అడుగులు పడలేదు. ఇక మంచినీళ్లపేట వద్ద జట్టీ నిర్మాణం మట్టి పనులతోనే సరిపెట్టారు. సీఎం ఈ జిల్లాకు వచ్చిన పలు సందర్భాల్లో సాగరతీర మత్స్యకారులకు ఆదుకుంటామని బుడగట్లపాలెం, మంచినీళ్లపేటలో ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి కృషి చేస్తామని ఇచ్చిన హామీలు గాలిలోనే కలిసిపోయాయి. ఈ జిల్లాకు సంబంధించి మత్స్యశాఖ మంత్రి ఉన్నా జట్టీల నిర్మాణం ఐదేళ్లలో ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర అన్యాయం జరగడంతో ఈ జిల్లా నుంచి పలువురు మత్స్యకారులు ఉపాధి కోసం గుజరాత్‌లోని కాండ్లా, చెన్నై, ఒడిశా ప్రాంతాలకు వలసలు పోతున్నారు. ఇప్పటికైనా కోల్డ్‌స్టోరేజ్‌తో పాటు జట్టీలను నిర్మించాలని మత్స్యకారులు కోరుతున్నారు.



వలలు కుట్టుకుంటున్న మత్స్యకారులు

చంద్రబాబునాయుడు పర్యటన ఖరారు

- హెలీప్యాడ్, సభాస్థలాన్ని పరిశీలించిన ఎస్పీ రాధిక, గౌతు శిరీష



హెలీప్యాడ్ వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రాధిక

పలాస, ఏప్రిల్ 13: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పలాసలో రోడ్ షో నిర్వహించనున్న నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను శనివారం సాయంత్రం ఎస్పీ జీఆర్ రాధిక, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పరిశీలించారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు పలాస వచ్చి రోడ్‌షో, బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఎస్పీ ఇందిరాచౌక్, రోడ్‌షో ప్రాంతాలను పరిశీలించారు. ఇంది రా చౌక్ వద్ద సభ నిర్వహణకు ఏర్పాట్లు చేయడంతో ఆ ప్రాంతంలో విద్యుత్ వైర్ల సమస్య ఉన్నట్లు గుర్తించి తగు ఆదేశాలు జారీ చేశారు. పార్కింగ్ స్థలాలు, వీఐపీ పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి తగు ఏర్పాట్లు చేయా లని డీఎస్పీ నాగేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా హెలీప్యాడ్ వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని, చుట్టూ బారికేట్లు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని సూచించారు. సీఐ విజయానంద్, ఎస్ఐ పారినాయుడు ఉన్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి: శిరీష

టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పలాస టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష కోరారు. ఈ మేరకు ఆమె చంద్రబాబు పర్యటించే ప్రాంతాలు, హెలీప్యాడ్‌ను పరిశీ లించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్‌షో, కార్యకర్తలతో సమావేశం, పార్లమెంటరీ నియోజకవర్గంలో మూడు పార్టీల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, గురిటి సూర్యనారాయణ, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్‌గుప్తా, మల్లా శ్రీనివాస్, జోగ మల్లి పాల్గొన్నారు.



హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గౌతు శిరీష, నాయకులు

పలాసలోనే...

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

చంద్రబాబునాయుడు పర్యటన కేవలం పలాసలో మాత్రమే జరగనుంది. ముందుగా టెక్కలి, పలాస కేంద్రాల్లో సభ నిర్వహించేలా షెడ్యూల్ రూపొందించారు. అయితే అనివార్య కారణాలతో టెక్కలిలో చంద్రబాబు సభ రద్దయింది. పలాసలో సోమవారం రాత్రి ఏడు గంటలకు 'ప్రజాగళం' పేరిట పలాస జంక్షన్ లోనే చంద్రబాబు ప్రసంగిస్తారు. ముందుగా రాజాంలో పర్యటన ముగించుకుని హెలీకాప్టర్ లో చంద్రబాబు పలాస చేరుకుంటారు.

ప్రజలు ధైర్యంగా ఓటు వేయాలి

- స్వీప్ కార్యక్రమంలో కలెక్టర్



ప్రమాణం చేయిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఏప్రిల్ 13: ప్రజలు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ధైర్యంగా ఓటు వేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో శనివారం నిర్వహించిన స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు కలెక్టర్ అవగాహన కల్పించారు. సంతకాల సేకరణ, ఫొటో కియోస్క్ కేంద్రాన్ని ప్రారంభించారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల కన్నా ఈసారి పోలింగ్ శాతం మరింత పెరగాలన్నారు. మహిళలు, దివ్యాంగులు ఓటు వేసేందుకు ముందుకు రావాలన్నారు. మారుమూల గ్రామాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అందరితో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, డ్వామా పీడీ చిట్టిరాజు, శ్రీకాకుళం ఆర్డీవో సీహెచ్ రంగయ్య, మెప్మా పీడీ కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం..

ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. శనివారం అంబేడ్కర్ ఆడిటోరియంలో మైక్రో అబ్జర్వర్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ విధానాన్ని పరిశీలిస్తూ ఎలాంటి తప్పిదాలు, ఉల్లంఘనలు జరిగినా రిటర్నింగ్, ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. పోలింగ్‌కు గంట ముందు మాక్ పోలింగ్ నిర్వహించాలని తెలిపారు. అభ్యర్థికి ఒక పోలింగ్ ఏజెంట్ మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ విధానం, ఈవీఎం, వీవీ ప్యాట్ల వినియోగంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. మైక్రో అబ్జర్వర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఫారం-12 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు, శిక్షణ కార్యక్రమాల సమన్వయకర్తలు బాలాజీ నాయక్, ఎం.కిరణ్‌కుమార్, శేషగిరిరావు, బి.శాంతిశ్రీ, ఎం.సూర్య కిరణ్, దాదాపు 300 మంది మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

భానుడు భగభగ



- ఇళ్లనుంచి బయటకు రాలేకపోతున్న ప్రజలు
- పనులు చేయలేకపోతున్న వృత్తిదార్లు

నరసన్నపేట, ఏప్రిల్ 13: జిల్లాలో భానుడు భగభగమంటున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. గాలిలో తేమశాతం తగ్గడంతో ఉక్కపోతకు గురై అల్లాడుతున్నారు. దీనికి తోడు వేడిగాలులు వీస్తుండడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఎన్నడూ లేని విధంగా జిల్లాలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు నమోదవుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ప్రధాన రహదారులపై జన సంచారం లేక కర్ఫ్యూను తలపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సమయపాలన లేకుండా విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లు పని చేయక ప్రజలు మగ్గి పోతున్నారు. వృద్ధులు, చిన్నారులు, రోగుల బాధలు వర్ణనాతీతం. ఎండవేడిమికి వృత్తిదారులు తమ పనులు చేయలేకపోతున్నారు. ఉపాధి కూలీలు 10 గంటలకే ఇళ్లకు తిరిగి వస్తున్నారు. కొన్ని రోజులు పనులు నిలిపివేయాలని పలుచోట్ల ఉపాధి కూలీలు అధికారులను కోరుతున్నారు. ఎండల దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితిల్లో మాత్రమే ఇంటి నుంచి బయటకు రావాలని చెబుతున్నారు. వీలైనంత వరకు ఉదయం 11 నుంచి 4 గంటల మధ్య బయట తిరగక పోవడం ఉత్తమం అని కోటబొమ్మాళి సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ పొన్నాడ గణేష్ తెలిపారు.



శనివారం మధ్యాహ్నం జమ్ము జంక్షన్ వద్ద నిర్మానుష్యంగా ఉన్న పర్లాకిమిడి జాతీయ రహదారి

పిందె దశలోనే ఎండిపోయి..

● ఆందోళన చెందుతున్న జీడి రైతులు

(వజ్రపుకొత్తూరు)

ఈ ఏడాది జీడి పంటలో తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడు తోంది. సుమారుగా ఆరు నెలలుగా సరైన వర్షాలు లేకపోవడం, తెల్లబూజు తెగులు సోకడంతో పిందె దశలోనే జీడి పిక్కలు ఎండిపోతు న్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి అంతంత మాత్రంగా ఉన్న సమయంలో పిందె దశలోనే పిక్కలు ఎండిపోతుండడంతో మరింత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వారు పేర్కొంటున్నారు. ఈ దశలోనే వాడాల్సిన క్రిమిసంహారక మందులపై అవగాహన లేకపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారు. ఇప్పటికే జీడి పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, అప్పుల పాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. ధరలు కూడా తగ్గా యని, దిగుబడి అదే స్థాయిలో ఉండడంతో పాలుపోవడం లేదని పేర్కొంటున్నారు. రాష్ట్రప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహకాలు అందడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని పంటల పరిరక్షణకు సహకరించాలని కోరుతున్నారు.



పిందె దశలోనే ఎండిపోతున్న జీడిపిక్కలు



రైతుల్లో అవగాహన కల్పించాలి..

జీడిపంటకు సోకిన తెగుళ్ల నివారణపై రైతుల్లో అవగాహన కలిగించాలి. పిందె దశలోనే పిక్కలు ఎండిపోతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జీడి తెగుళ్లపై వాడాల్సిన మందులు తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవగాహన కలిగించాలి.

-సాన కృష్ణారావు, చినవంక

చంద్రబాబు టెక్కలి పర్యటన వాయిదా

టెక్కలి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం టెక్కలి లో నిర్వహించాల్సిన ప్రజాగళం సభ వాయిదా పడిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నా యుడు తెలిపారు. ఈనెల 22న నామినేషన్ ప్రక్రియ ఉండడంతో ఈ ప్రజాగళం సభ వాయిదా పడిందన్నారు. వాస్తవానికి సోమవారం నాడు రాజాం, పలాస, టెక్కలిలో చంద్రబాబు ప్రజాగళం సభలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. ఒక్క టెక్కలి సభ మాత్రమే వాయిదాపడిందని ఆయన తెలిపారు.

పూడిలంక రోడ్డు పనులు పూర్తి చేయండి

వజ్రపుకొత్తూరు: పూడిజగన్నాథపురం పంచాయతీ పూడిలంక గ్రామానికి పూర్తి స్థాయిలో రోడ్డు సదుపాయం కల్పించాలని గ్రామస్థులు టీడీపీ అభ్యర్థి గౌతు శిరీషను కోరారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసి రోడ్డు సమస్యను విన్నవించారు. టీడీపీ పాలనలో ఎమ్మెల్యేగా గౌతు శివాజీ పూడిలంక రహదారి కోసం రూ.1.30 లక్షలు కేటాయించి 75 శాతం పనులు పూర్తిచేశారన్నారు. తరువాత ప్రభుత్వం మారడంతో ఆ పనుల్లో పురోగతి కనిపించ లేదన్నారు. ఈసారి ఎన్నికలలో ఎలాంటి తప్పు జరగకుండా టీడీపీకి మద్దతు ప్రకటి స్తున్నా మన్నారు. దీనిపై స్పందించిన శిరీష టీడీపీ అధికారంలో వచ్చిన వెంటనే పూడిలంకకు రహదారి నిర్మాణం పూర్తి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో బుల్లోజు శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలకు వైసీపీ ప్రభుత్వమే కారణం

టెక్కలి: ఐదేళ్లలో అన్నిరకాల ధరలు ఆకాశాన్నంటాయని, దీనికి వైసీపీ ప్రభుత్వ విధానాలే కారణమని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. శనివారం నర్సింగపల్లి పంచాయతీ కొల్లివలస, జగన్నాథ పురం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అచ్చెన్నాయుడు, ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ షణ్ముఖరావు, నేతలు రామకృష్ణ, దమయంతి, పురుషోత్తం, రాము, లవకుమార్, చిన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధిష్ఠానం పునరాలోచించాలి: కలమట

పాతపట్నం: పాతపట్నం అసెంబ్లీ అభ్యర్థి విషయంలో టీడీపీ అధిష్ఠానం పునరాలోచించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. పాతపట్నంలో శనివారం 'న్యాయం కోసం.. కలమట కోసం' పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు కూడలి వద్ద మాజీ ఎమ్మెల్యే సీనియర్ నాయకుడు కలమట మోహనరావు మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలను తన కుటుంబీకులుగా భావించానని, ఎన్నడూ అవినీతి ఆరోపణలు లేని పాలన అందించానన్నారు. ప్రజలు కూడా తనను ఆదరించారని చెప్పారు. అయితే అధిష్ఠానం అనాలోచిత నిర్ణయంతో మరలా కష్టకాలమొచ్చిందన్నారు. కలమట వెంకటరమణ మూర్తి మాట్లాడుతూ.. అధిష్ఠానం పిలుపు ఇచ్చిన అన్ని కార్యక్రమాలను చేపట్టామని, జిల్లాలో లోకేష్ చేపట్టిన అన్ని ప్రాంతాల కంటే ముందున్నావంటూ చంద్రబాబు కితాబిచ్చారన్నారు. అయితే టికెట్ విషయంలో కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసేలా నిర్ణయం తీసుకోవడం సబబు కాదన్నారు. పునరాలోచించాలని కోరారు.



పాతపట్నం ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి

విద్యార్థినులకు అభినందన

పోలాకి: ఈదులవలస మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ శనివారం అభినందించారు. అధిక మార్కులు సాధించిన ద్వితీయ సంవత్సరం విద్యార్థి నులు కాతారి మంజు, బగడల చందన, ఎస్.లావణ్య, పూతి మానసలను అభినందించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 71.73 శాతం, ద్వితీయ సంవత్స రంలో 87.93 శాతం ఫలితాలు సాధించారన్నారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ నీలం, అధ్యాపకులు అభినం దించారు. పోలాకి ప్రభుత్వ కళాశాల నుంచి ఇంటర్‌ప్రథమ సంవ త్సరంలో 61 శాతం, ద్వితీ య సంవత్సరంలో 67 శాతం ఫలితాలు సాధించామని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గోవిందరావు తెలి పారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు అభినందిం చారు. ప్రియాగ్రహారం గరిమెళ్ల కళాశాల నుంచి సీపాన అనూష 926 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ ఎస్.ఎస్.ఎస్.నాగకుమారి తెలిపారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

అంబేడ్కర్ జయంతినాడు మద్యం షాపులకు సెలవు ప్రకటించాలి

నందిగాం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతినాడు మద్యం షాపులకు సెలవు ప్రకటించాలని జిల్లా మాలమహా నాడు ప్రధాన కార్యదర్శి తుంగాన తిరుపతిరావు, గౌరవ ప్రతినిధి కూరాకుల వెంకట్రావు కోరారు. ఈ మేరకు శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి నాగరాజుకు వినతి పత్రం అందించారు. స్వాతంత్ర్యాన్ని అహింసా మార్గంలో తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జయంతి నాడు మద్యం దుకాణాలకు సెలవు ప్రకటిస్తున్నారని, దీనికి అనుగుణంగా అంబేడ్కర్ జయంతి నాడు కూడా దుకాణాలను మూసివేస్తేనే ఆయనకు ఘన నివాళి అవుతుందన్నారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న సంఘం ప్రతినిధులు

కారు బోల్తా

నందిగాం: పెదబాణాపురం సమీపంలో హైవేపై శనివారం కారుబోల్తా పడింది. అయితే ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చు కున్నారు. స్థానికులు తెలిపిన వివరా లిలా ఉన్నాయి.. టెక్కలి నుంచి పలాస వైపు కారు వెళ్తుండగా బాణాపురం వచ్చేసరికి వేగంగా బోల్తా పడింది. కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. ఎవరికీ పెద్దగా గాయాలు కాకపోవడంతో వారిని ఆర్టీసీ బస్సులో పలాసకు చికిత్స నిమిత్తం తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులను అడగగా తమకు సమాచారం లేదన్నారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు అవసరం: బగ్గు



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి

నరసన్నపేట: ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రాభివృద్ధికి టీడీపీ అధినేత చంద్రబాబు సేవలు అవసరమని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి మద్దతివ్వాలని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం పట్టణంలో పాతబస్టాండ్, గాంధీనగర్, స్టేట్‌బ్యాంకు వీధి, విలేకర్ల కాలనీ, శివరాంపురం, ముద్దాడ పేటల్లో ప్రచారం నిర్వహించారు. చంద్రబాబును సీఎంగా చేయడం ద్వారా మహి ళలు మరింత ఆర్థిక స్వావలంబన సాధిస్తారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు సామాన్యులకు అండగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు బలగ ప్రవీణ్, గొద్దు చిట్టిబాబు, శిమ్మ చంద్రశేఖర్, ఉణ్న వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ● **జలుమూరు:** టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని మాజీ జడ్పీటీసీ, ఉమ్మడి అభ్యర్థి సతీమణి బగ్గు సుగుణమ్మ కోరారు. తిమడాం, సురవరం గ్రామ పంచాయతీల్లో శనివారం ప్రచారం నిర్వహించారు.

సూపర్‌సిక్స్‌తో న్యాయం: గోవిందరావు



స్కాట్‌పేటలో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు

ఎల్.ఎన్.పేట: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలుచేయనున్న సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. శనివారం స్కాట్‌పేట, గొట్టిపల్లి పెద్ద కొల్లివలస, చిన్న కొల్లివలస ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, కొమ్మువలస తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు అందించి అవగాహన కలిగించారు.

రానున్న ఎన్నికలో అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయ కులు వి.గోవిందరావు, కె.కృష్ణమాచారి, ఎస్.నారాయణరావు, జి. రాము, ఎ.పోలినాయుడు, ఎస్. మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నందిగాం: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను టెక్కలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ శనివారం పరిశీలించారు. కృష్ణరాయపురం, కణితివూరు, మణిగాం, వేణుగోపాలపురం, వల్లభ రాయుడుపేట, దేవాడ, దొడ్లరామచంద్రాపురం, నరేంద్రపురం, పాలవలస, నందిగాం, సుభద్రాపురం, బెజ్జిపల్లిలో ఏర్పాటుచేసిన కేంద్రాలను నిశితంగా పరిశీలించి సదుపాయాలపై ఆరా తీశారు. కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన అన్నిరకాల సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆయనతో పాటు తహసీల్దార్ వి.పద్మావతి, ఎంపీడీవో జి.శివప్రసాద్, సెక్టార్ అధికారి కె.శ్రీధర్ తదితరులున్నారు.

టెక్కలి: గూడెం పంచాయతీ పిట్టలసరియా పోలింగ్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ శనివారం పరిశీలించారు. ఓటర్ల సంఖ్య, 80 ఏళ్లు దాటిన ఓటర్లు, పోలింగ్ స్టేషన్‌లో సదు పాయాల కల్పనపై ఆరా తీశారు. బీఎల్వో సంపతిరావు భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నందిగాం: పాలవలస పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో నూరుల్ కమర్

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు

హిరమండలం: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు, ప్రత్యేక కేంద్ర బలగాలు శనివారం కవా తు నిర్వహించాయి. హిరమండలం, సుభలయ, గులుమూరు, కొండరాగోలు గ్రామాల్లో కొత్తూరు సీఐ వేణు గోపాలరావు ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఎవరైనా అల్లర్లు సృష్టించి నా, అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నారాయణస్వామి, ఏఎస్‌ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



హిరమండలంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

స్వీప్ ఆధ్వర్యంలో ఓటర్లలో చైతన్యం



టెక్కలి అంబేడ్కర్ కూడలిలో సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

టెక్కలి: స్వీప్ ఆధ్వర్యంలో ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాన్ని శనివారం అంబేడ్కర్ జంక్షన్‌లో సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంతకాల సేకరణను చేపట్టారు. ప్రజా స్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఆర్వో మురళీ కృష్ణ, ఎస్‌ఐ లక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన



మందసలో బ్యానర్‌పై సంతకం చేస్తున్న తహసీల్దార్ తిరుమలబాబు

మందస: ప్రతి ఒక్కరు ఓటు విలువను తెలుసుకోవాలని తహసీల్దార్ తిరుమలబాబు అన్నారు. మందస బస్టాండ్ ఆవరణలో శనివారం ఓటు వినియోగంపై అవగాహన కలిగించి, సంతకాల సేకరణ చేపట్టారు. ఎన్ని కల్లో తన విలువైన ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ ఎం.కృష్ణమూర్తి, ఆర్‌ఐ ఎస్.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత

● 50 వేల మందితో 22న నామినేషన్

● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు



నాలుగు మండలాల శ్రేణులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

టెక్కలి, ఏప్రిల్ 13: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకత ఉందని, అందుకే ప్రజలంతా టీడీపీ వైపు చూస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో నాలుగు మండలాల ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరో 10, 15 రోజుల్లో నియోజకవర్గంలో వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. వైసీపీ నాయకులు కొందరు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారంలో యువతకు పోర్టులో ఉద్యోగా వకాశాలు కల్పిస్తామని అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఎప్పుడూ టీడీపీకి ఓటువేయని గ్రామాలు సైతం ఈసారి టీడీపీని ఆదరిస్తున్నాయన్నారు. ఈ నెల 22న టెక్కలి నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా తాను నామినేషన్ వేయనున్నాయని, 50 వేల మంది ప్రజలు హాజరవు తారని, టీడీపీ-జనసేన-బీజేపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

వైసీపీ నుంచి వందలాది కుటుంబాలు టీడీపీలో చేరిక

టెక్కలి నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల పరిధిలోని పలు గ్రామాల నుంచి వందలాది వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వందలాది వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి అచ్చెన్నాయుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరేవారికి ఈనెల 18 వరకు మాత్రమే గేట్లు తెరిచి ఉంచుతామన్నారు. టీడీపీలో చేరిన వారు మాట్లాడుతూ అభివృద్ధి చేసే నాయకుడు అచ్చెన్నాయుడు అని, ఆయన వెంటే తామంతా నడుస్తా మన్నారు.

మలగాంలో ప్రచారం

సంతబొమ్మాళి: మండలంలోని తీరప్రాంత గ్రామమైన మలగాంలో శనివారం సాయంత్రం ఎన్డీఏ అభ్యర్థి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైసీపీకి ఓటేస్తే రాష్ట్రం ఇంకా అధోగతికి చేరు కుంటుందన్నారు. మలగాం పంచాయతీలో గత ఐదేళ్లు గా సాగునీరు రాక రైతులు పూర్తిగా నష్టపోయారని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సాగునీటి కాలు వలకు లైనింగ్ చేస్తామన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును గెలిపించాలని కోరారు. మలగాం మాజీ సర్పంచ్ పుక్కళ్ళ రాజ్యలక్ష్మి, ఆమె భర్త ధర్మరాజులతో పాటు 50 వైసీపీ కుటుంబాలు, లక్కివలస పంచాయతీ గొలుగువానిపేట గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నేతలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మలగాం మాజీ సర్పంచ్ బుచ్చ మురళీకృష్ణ, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, మాజీ జడ్పీటీసీ బాదాన వెంకట రమణమ్మ, మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మందస: మందస విద్యుత్ సబ్ స్టేషన్ హొన్నాళి 11 కేవీ పరిధిలో గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జీఈ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియ చేపడుతున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జ్ఞాన సరస్వతీదేవికి వెండి మకరతోరణం

పలాస: స్థానిక సీతారామాలయంలోని జ్ఞాన సరస్వతీ దేవికి శనివారం భక్తులు వెండి మకరతోరణం, కిరీట ధారణ సమర్పించారు. పురోహితులు నగరంపల్లి ప్రసాదరావు శర్మ ఆధ్వర్యంలో వెండి ఆభరణాలకు సంప్రోక్షణచేసి అమ్మవారికి అలంకరించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా భక్తుల వితరణతో వీటిని తయారు చేయించినట్లు ఆలయ కమిటీ కార్యదర్శి గిన్ని జయ శంకర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు.



నేడు 'పైల' స్మారక సభ

పలాసరూరల్: సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు, రాష్ట్ర మాజీ కార్యదర్శి పైల వాసుదేవరావు వర్ధంతి సందర్భంగా మామిడిపల్లి గ్రామంలో ఆదివారం నక్సల్‌బరీ విప్లవోద్యమ స్మారక సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు కోరారు. శనివారం గ్రామంలో సమావేశం నిర్వహించారు. వక్తలుగా సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, పీవోడబ్ల్యూ సభ్యురాలు సంధ్య, జాతీయ కన్వీనర్ విష్ణు హాజరవుతున్నారని, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి సామాలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

నందిగాం: నందిగాం సామాలమ్మతల్లి ఆలయ ఐదో వార్షికోత్సవం ఆదివారం నుంచి మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు ఆదివారం ఆలయ ప్రాంగణంలో విశేష పూజలతో పాటు సామూహిక కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. సోమవారం అన్నప్రసాద వితరణ, భజన, మంగళవారం అమ్మవారి గజముద్ద, ఘటాల ఊరేగింపు సాగుతుందన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని నిర్వాహకులు కోరారు.

రాళ్లతో దాడి దారుణం

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి, టీడీపీ నేత మామిడి గోవిందరావుపై పొన్నుటూరు గ్రామానికి చెందిన నాసాల హరితో రెక్కీ వేసి రాళ్లతో దాడి చేయించి మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి దిగజారుడుతనానికి పాల్పడ్డారని టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పాతపట్నంలోకి ర్యాలీ ప్రవేశిస్తుండగా రోడ్డు పక్క ఉన్న ఓ ఇంటి పైనుంచి హరి రాళ్లతో దాడికి దిగాడన్నారు. ఈ దాడిలో గోవిందరావు అనుచరుడు శంకరరావుకు దెబ్బలు తగిలాయన్నారు. కలమటకు సీటు రాలేదన్న అక్కసుతో ఇలా దాడి చేయించడం తగదన్నారు. ఈ ఘటనపై ఇరువర్గాలు పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు.

నిర్లక్ష్యం



రాళ్లుదేలిన రంకిణి రోడ్ ఇదే..

స్థానిక ఆలాంద్ర రోడ్ నుంచి రంకిణి వెళ్లే బీటీ రోడ్ రాళ్లు తేలి దారుణంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణ మంటేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. రంకిణి, భగంతర, బురికిపేట తదితర గిరిజన గ్రామాల ప్రజలు పాతపట్నం రావాలంటే ఈ మార్గమే శరణ్యం. రోడ్డంతా గోతులమయమై, రాళ్లుదేలి ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

-పాతపట్నం

నిరుపయోగం



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

చిత్రంలో కనిపిస్తున్నవి నరసన్నపేట పట్టణంలోని సోమవారం సంతలో నిర్మించిన మరుగుదొడ్లు. ఐదేళ్ల కిందట రూ. 2లక్షలతో వీటిని నిర్మించారు. అయితే నిర్వహణ లేకపోవడంతో తలుపులు చోరీకి గురై నిరుపయోగంగా తయారయ్యాయి. దీంతో సంత పనులపై వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టి సారించి వీటిని వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఈవో చిన్నారావు వద్ద ప్రస్తావించగా నీటి సదుపాయం లేకపోవడంతో నిర్వహణ చేయలేదని, తగు చర్యలు తీసుకుంటామన్నారు.

-నరసన్నపేట

ట్రెంచ్‌లు వేయరా?

- బీటీ రహదారి పనుల్లో నాణ్యతా లోపం
- శిథిలావస్థలో కల్వర్టులు
- పట్టించుకోని అధికారులు


శిథిలమైన కల్వర్టు

జి.సిగడాం: పెంట నుంచి పొగిరి కూడలికి వెళ్లే సుమారు రెండున్నర కిలోమీటర్ల బీటీ రహదారి పనులు సాగుతూనే ఉన్నాయి. శంకుస్థాపన చేసి రెండు నెలలు దాటుతున్నా పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. అలాగే రోడ్డుకి ఇరువైపులా ట్రెంచ్‌లు వేయకపోవడంతో వర్షాలకు రోడ్డు కొట్టుకుపోవడంతోపాటు ప్రమాదాలకు అవకాశం ఉంటుందని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు శిథిల కల్వర్టులు ఉన్నాయి. సాగునీరు, వర్షపు నీరు పోయేందుకు రోడ్డు పొడవునా ఉన్న ఆరు కల్వర్టుల్లో కొన్ని శిథిలావస్థలో ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేయకుండా రోడ్డు నిర్మాణం చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు కూడా నాసిరకంగా ఉన్నాయంటూ పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పనుల్లో నాణ్యతతోపాటు శిథిలమైన కల్వర్టులు బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


ట్రెంచ్ వేయకుండా వదిలేసిన రోడ్డు

గంజాయి పట్టివేత

కొత్తూరు: కడుం గ్రామం వద్ద శనివారం ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న గంజాయిను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకున్నారు. గుణుపూర్ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టీసీ బస్సులో సిబ్బంది తనిఖీలు చేశారు. ఆ సమయంలో కొందరిని అనుమానించి వారి బ్యాగ్‌లను తనిఖీ చేశారు. వీరి నుంచి సుమారు 45 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం స్వాధీనం

బూర్జ: తోటవాడ జంక్షన్ వద్ద శనివారం సాయంత్రం అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టుకున్నట్టు ఎస్‌ఐ జీవీ ప్రసాద్ తెలిపారు. 180 ఎంఎల్ మద్యంసీసాలు మొత్తం తొమ్మిది స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బూర్జ మండలం తిమడాం గ్రామానికి చెందిన కొల్ల వెంకటనాయుడుగా గుర్తించినట్టు తెలిపారు. సదరు నిందితుడు పోలీసులను చూసి మద్యం సీసాలను గోనెసంచిలో దాచి వేయడానికి ప్రయత్నిస్తుండగా సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


మాట్లాడుతున్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు

ఇచ్ఛాపురం: నిబంధలను అతిక్రమించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు హెచ్చరించారు. శనివారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు డ్రైవ్ చేస్తూ పట్టుబడితే వాహన యజమానులపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. లైసెన్సులు, హెల్మెట్లు లేకుండా వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రధానంగా బైక్‌లకు కంపెనీ ఇచ్చిన సైలెన్సర్లు తీసి(శబ్ద కాలుష్యం) సౌండ్ పొల్యూషన్ ఉన్న సైలెన్సర్లు వాడుతున్న 15బైకులు పట్టుకొని ఫైన్ వేయడంతో పాటు సైలెన్సర్లు తొలగించినట్టు తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ తీవ్రతపై దృష్టి సారించామన్నారు. హెవీ వెహికల్స్ టౌన్‌లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాహనాలు లోడింగ్, అన్‌లోడింగ్ కారణంగా ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని, ఉదయం 8గంట లోపు రాత్రి 8గంటల తర్వాత మాత్రమే హెవీ వెహికల్స్‌కు టౌన్‌లోకి అనుమతి ఉంటుందన్నారు. ఫంక్షన్లకు డీజే పెట్టాలంటే డీఎస్పీ అనుమతి తీసుకోవాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. పురుషోత్తపురం చెక్ సమీపంలో ఉన్న 14 బడ్డీల్లో దాడులు జరిపామని గంజాయి అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. రాత్రి గస్తీ ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టణ ఎస్‌ఐ సత్యనారాయణ ఉన్నారు.

నడవడిక బాగోకపోతే నగర బహిష్కరణే



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ ఉమామహేశ్వరరావు

శ్రీకాకుళం క్రైం: రానున్న ఎన్నికల్లో రౌడీషీటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, అలా కాదని ఎటువంటి తప్పు చేసినా క్షమించేది లేదని టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శనివారం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి నామినేషన్లు, మే 13న ఎన్నికలు జరగనున్నాయని ఈ నేపథ్యంలో రౌడీషీటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని, అలాకాకుండా రాజకీయ పార్టీల వెంట తిరుగుతూ ఎటువంటి ప్రలోభాలకు, గొడవలకు వెళ్లినవారిని నగర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. తాను వచ్చిన మూడు నెలలో ఎవరు గొడవలకు పోవట్లేదు, కనుక వారి పట్ల గౌరవంగా ఉన్నామని తెలిపారు. తెలిసో తెలియకో చేసిన తప్పుల కారణంగా రౌడీ షీటర్లుగా మారారని జీవితాంతం అలానే ఉంటారా అని సీఐ ప్రశ్నించారు. సమాజంలో గౌరవంగా బతకాలని ఎటువంటి గొడవలకు వెళ్లకుండా ఉంటే నాలుగేళ్లలో రౌడీషీట్లు తీసేస్తామని వివరించారు. ఇప్పటికే కొంత మందిపై నిఘా ఉంచామని వారు భూ కబ్జాలు, క్రికెట్ బెట్టింగ్‌లు, సెటిల్‌మెంట్లు చేస్తున్నట్టు తమకు సమాచారం ఉందని వీటికి దూరంగా ఉండాలని, సమాజానికి, ప్రజలకు రౌడీషీటర్లు నుంచి ఎటువంటి ఇబ్బంది కలగకూడదని అలా జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. ఎన్నికల కేసులో దొరికితే జీవితాంతం రౌడీషీట్ ఉంటుందని, ఈ విషయం గర్తెరిగి మంచి నడవడికతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సీఐతో పాటు ఎస్‌ఐలు హరికృష్ణ, శ్యామలరావు తదితరులు ఉన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు మేనిఫెస్టోలో చేర్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు

అరసవల్లి: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని, అలా చేసిన వారికే రానున్న ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని అగ్రిగిల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. నగరంలోని స్థానిక దాసరి క్రాంతి భవన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అగ్రిగోల్డ్ యాజమాన్యం పక్షమో? లేదంటే అగ్రిగోల్డ్ బాధితుల పక్షమో? బహిరంగంగా చెప్పాలని డిమాండ్ చేశారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం బాధితుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. బాధితులు మరణిస్తే రూ.10 లక్షలు పరిహారం ఇస్తామని జగన్‌రెడ్డి ఇచ్చిన హామీ ఈ ఐదేళ్ల పాలనలో ఏమైందని నిలదీశారు. న్యాయం చేస్తామని చెప్పిన జగన్‌రెడ్డి తమ చెవుల్లో పువ్వులు పెట్టారన్నారు. సీపీఐ నాయకుడు చాపర వెంకటరమణ మాట్లాడుతూ.. మృతి చెందిన అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులతో పాటు బాధితులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించండి


మురపాక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో లక్ష్మణమూర్తి

లావేరు: మండలంలోని పోలింగ్ కేంద్రాలు వద్ద తాగునీరు, నీడ, ర్యాంపు వంటి కనీస సౌకర్యాలు ఉండేటట్టు ఏర్పాట్లు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మణమూర్తి బీఎల్‌వోలను ఆదేశించారు. శనివారం బుడుమూరు, మురపాక, కేశవరాయునిపాలెం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతగా ఓట్లు వేసేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాలను తీర్చి దిద్దాలన్నారు. మండలంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీదేవి, ఎస్‌ఐ స్వామినాయుడు, బీఎల్‌వోలు తదితర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా సాంకేతిక ఉత్సవ్


పరిశీలిస్తున్న క్యాంపస్ డైరెక్టర్ బాలాజీ

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్‌లో సాంకేతిక ఉత్సవ్ సందడిగా జరుగుతోంది. ఈ నెల 12న టెకీవేర్స్-2కె24 పేరిట ప్రారంభమైన ఈ ఉత్సవ్ 14వ తేదీతో ముగియనుంది. శనివారం ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రజెంటేషన్‌ను క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ ప్రారంభించారు. ఇంజనీరింగ్ ప్రథమ, ద్వితీయ, పీయూసీ విద్యార్థులు రూపొందించిన 90 ప్రాజెక్టలను 50 స్టాల్స్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్యాంపస్ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ మాట్లాడుతూ.. ఇలాంటి టెక్‌ఫెస్ట్‌ల వల్ల విద్యార్థుల్లో మరింత నైపుణ్యం పెంపొం టదుతుందన్నారు. సృజనాత్మకంగా ఆలోచించడంతోనే విద్యార్థులు మరింత రాణించగలరన్నారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యంతో తయారు చేసిన ఈపిల్ టవర్, మంచులో కూడా ఎలాంటి ప్రమాదం లేకుండా ప్రయాణించే డ్యూ యాక్సిడెంట్ కంట్రోలర్, నదిలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరణ, వ్యవసాయంలో సాంకేతికను జోడించే స్మార్ట్ ఫీల్డ్ మేనేజ్‌మెంట్, విద్యుత్ ప్రమాదాల నివారణకు స్మార్ట్ పోల్ సేఫ్టీ సిస్టమ్ తదితర ప్రాజెక్టలను విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ పాత్రుడు, ఏవో ముని రామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఫెస్ట్ కన్వీనర్ వాసు, కో కన్వీనర్ దిలీప్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపు ప్రక్రియ పరిశీలన


ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్: ఎన్నికల ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయినందున వాటిని ఆయా శాసనసభ నియోజకవర్గాలకు తరలించే కార్యక్రమాన్ని కలెక్టర్ వివిధ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నిబంధనలను ప్రతీ ఒక్కరూ విధిగి పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఈవీఎంల నోడల్ అధికారి కె.సుధ, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీకూర్మంలో మత్స్య జయంతి ఉత్సవం


పూజలు చేస్తున్న దృశ్యం

గార: ప్రసిద్ధ శ్రీకూర్మ క్షేత్రంలో మహా విష్ణువు దశావతారాల్లో తొలి అవ తారం మత్స్యావతారం జయంతి ఉత్సవం శనివారం ఉదయం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్వేత పుష్కరిణి వద్ద ఉన్న మత్స్యనారాయణ స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాస్ స్వామి వారికి ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది, నామినేషన్ల సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఎంసీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఏ పార్టీ రాజకీయ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లఘించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోడ్ ఉల్లంఘిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్, ఎంపీడీలు పాల్గొన్నారు.

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం


ఈవోకు చెక్కును అందిస్తున్న భక్తులు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి శ్రీకాకుళం పట్టణానికి చెందిన గుంటూరి సీతారామారావు, ఉషాదేవి దంపతులు లక్ష రూపాయల చెక్కును ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు శనివారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యుడు లుకలాపు గోవిందరావు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

జగన్‌రెడ్డిది అరాచక పాలన

- ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు


సోంపేట: ర్యాలీలో పాల్గొన్న ఎంపీ రామ్మోహన్, ఎమ్మెల్యే అశోక్

సోంపేట: జగన్‌రెడ్డి రాష్ట్రంలో అరాచక పాలన సాగించారని, దీనిపై ఇంటింటా ప్రచారం చేపట్టాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం వివిధ గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత్రకొండ, జగతికేశుపురం, మాకన్నపురం, పాలవసల, రాజాం, మామిడిపల్లి, జేపీ కొత్తూరు, కొర్లాం, సోంపేట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో జగన్ పాలనతో 20 ఏళ్లు వెనక్కు వెళ్లిందని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే మళ్లీ అభివృద్ధి సాధ్యమన్నారు. ర్యాలీలో జనసేన ఇన్‌చార్జ్ దాసరి రాజు, నాయకులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు, మద్దిల నాగేశ్వరరావు, బతకల జోగారావు, మడ్డు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిప్పనపుట్టుగలో ఎమ్మెల్యే అశోక్ సతీమణి..

ఇచ్ఛాపురం: రాష్ట్రంలో కూటమి ప్రభంజనం తథ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ సతీమణి నీలోత్పల అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తిప్పనపుట్టుగ గ్రామంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మండల టీడీపీ మహిళలు పాల్గొన్నారు.

మూల్యం చెల్లించుకోక తప్పదు

అరసవల్లి: జగన్‌రెడ్డి తన నిరంకుశ వైఖరికి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురం మాజీ సర్పంచ్ గుండ మోహనరావు పెద్ద ఎత్తున తన అనుచరులతో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ ఆధ్వర్యంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు సమక్షంలో శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఎంపీ సాదారంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గొండు జగన్నాథరావు, మండల పార్టీ నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి ధర్మాన చేసిందేమీ లేదు: శంకర్


శ్రీకాకుళం రూరల్: మాట్లాడుతున్న గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్: సామాన్యుడిని నాయకుడుగా ఎదిగేలా చేసిన పెద్దపాడు గ్రామానికి, ప్రజలకు మంత్రి ధర్మాన చేసిందేమి లేదని, యాదవుల పట్ల ధర్మానకు చిన్నచూపు తగదని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ విమర్శించారు. శనివారం పెద్దపాడు గ్రామంలోని యాదవ సంఘ నాయకుడు కలగ శ్రీను నివాసంలో గ్రామస్థులతో ఆత్మీయ కలయిక సమావేశం నిర్వహించారు.

కూటమి గెలుపుతోనే రాష్ట్రాభివృద్ధి

అరసవల్లి: రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలంటే కూటమి గెలుపుతోనే సాధ్యమని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని 27వ డివిజన్‌లో మైలపల్లి నర్సింహమూర్తి, బరాటం ఈశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఈ ఐదేళ్ల వైసీపీ పాలన మొత్తం ఆ పార్టీ నేతల అభివృద్ధికే సరిపోయిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పైడి వేణుగోపాలం, పూజారి చెల్లయ్య, నాగేశ్వరరావు, పొన్రంకి శంకర్, కోరాడ హరగోపాల్, పిరియా మాధవి, గురుప్రసాద్, ఉదయ్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

శిలగాంలో ప్రచారం

గార: కూటమి అభ్యర్థి గొండు శంకర్ సతీమణి స్వాతి శనివారం కళింగపట్నం పంచాయతీ శిలగాం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పీస వెంకట రమణమూర్తి, బడగల వెంకటప్పారావు, గుండ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి పంపండి.. అభివృద్ధి చేసి చూపిస్తా


లావేరు: బీజేపీలో చేరిన లక్ష్మీపురం వైసీపీ కార్యకర్తలతో ఎన్‌ఈఆర్

లావేరు: తనకు ఓటేసి ఒక్కసారి అసెంబ్లీకి పంపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఎచ్చెర్ల ఎన్డీఏ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్‌ఈఆర్) అన్నారు. శనివారం గుమడాం, బుడతవలస, బుడుమూరు, చినరొంపివలస, లక్ష్మీపురం, నేతేరు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. బుడుమూరు నారాయణ సాగర్‌ను మినీ రిజర్వాయర్‌గా మార్చాలన్న కలను నెరవేరుస్తానని, లక్ష్మీపురం, రాయినింగారిపేట వద్ద శిథిలావస్థకు చేరిన వంతెనల స్థానంలో కొత్తవి నిర్మాణాలు చేపడతామన్నారు. తోటపల్లి, మడ్డువలస సాగునీటి కాలువ పనులు చేపట్టి ఏడాది లోగా సాగునీరు తెప్పించి రైతులను ఆదుకుంటానన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ముప్పిడి సురేష్, ఐ.తోటయ్యదొర, విశ్వక్సేన్, శ్రీరాములునాయుడు, నల్లి లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ బోర పార్వతి ఆధ్వర్యంలో లక్ష్మీపురం పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్‌ఈఆర్ సమక్షంలో బీజేపీలో చేరారు.

ఎన్‌ఈఆర్‌కు ఒక్కచాన్స్ ఇవ్వండి

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యేగా నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్‌ఈఆర్) ఒక్క చాన్స్ ఇవ్వాలని అతని సతీమణి రజిని కోరారు. ఆత్మీయ కలయిక కార్యక్రమంలో భాగంగా శనివారం గిరివానిపాలెం గ్రామానికి సమీపంలో చెరువు పనులు చేస్తున్న ఉపాధి వేతనదారులను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జోగురాజు మౌళి, రత్నం, బాలి శ్రీను, వై.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన తప్పనిసరి


అంపోలులో అవగాహన కల్పిస్తున్న సీఐ

గార: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని సీఐ ఎల్.సన్యాసినాయుడు అన్నారు. శనివారం రాత్రి అంపోలులో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి తెలుసుకోవాన్నారు. ఎక్కడ తగువులు తగాదాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతీ ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కె.కృష్ణ ప్రసాద్, స్థానిక పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి పురస్కారం


కుమార్‌రాజును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, కవి, రచయిత బుర్రి కుమార్ రాజుకు సాహితీ కిరణం సంస్థ ఉగాది పురస్కారంతో సత్కరించింది. గుంటూరు జిల్లా పొత్తూరులో జరిగిన ఈ కార్యక్రమంలో కుమార్‌ను పురస్కారం అందించింది. ఈ సందర్భంగా కవులు, రచయితలు దాసు, బందికల్లు జమదగ్ని, ఈ వేమన, శరత్‌బాబు, వావిలపల్లి రాజారావు, డిప్యూటీ గ్రంథ పాలకులు వీజీ శంకరరావు అభినందనలు తెలిపారు.

ఓటు హక్కుపై సిగ్నేచర్ క్యాంపైన్



స్ర్కీన్‌పై సంతకం చేస్తున్న ఆర్వో దొర

ఇచ్ఛాపురం: ఓటు ఉన్న ప్రతీ ఓటరు తమ హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర అన్నారు. ఓటు హక్కు వినియోగం కార్యక్రమంలో భాగంగా శనివారం బస్టాండ్ జంక్షన్ వద్ద సంతకాల క్యాంపైన్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్ర్కీన్‌పై ఆర్వో సంతకం చేసి అంతా ఓటు వేస్తామని చెప్పి సంతకాలు చేయించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్‌తో పాటు నాలుగు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు సంతకాలు చేసి ప్రజలకు ఓట్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ శ్రీహరి, ఆర్‌ఐ శ్రావణ్‌కుమార్, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

టీడీపీలోకి 50 వైసీపీ కుటుంబాలు


టీడీపీలో చేరినవారితో కూన రవికుమార్

పొందూరు: మేజరు పంచాయతీ పొందూరులో అధికార వైసీపీకి షాక్‌లు తగులుతూనే ఉన్నాయి. శనివారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సమక్షంలో వైసీపీ పార్టీకి చెందిన కీలకమైన నాయకులు కుటుంబాల టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ చేరిన 50 కుటుంబాలకు చెందినవారికి రవికుమార్ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పీఎంసీ మాజీ ఛైర్‌పర్సన్ పిట్టా రాధ, 8వ వార్డుసభ్యులు కొండల పద్మ, నాగు, చిట్టి అప్పారావు, రమణ, పోలినాయుడు ఎ.లక్ష్మి, కె.శ్రీనివాసరావు దతితరులు చేరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, మాజీ సర్పంచ్ ఎ.విజయలక్ష్మి, నాయకులు బాడాన గిరి, ఎ.చినరంగ, కె.శ్రీనివాసరావు, కిషోర్, ఖండాపు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు వాణి, బాడాన హారిక, బి.శంకరభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ఓటు హక్కును ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని ఏపీఎం సనపల ప్రసాద్ అన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం డొంకూరులో మత్స్యకారులకు ఓటు హక్కు ప్రాధాన్యం, దాని విలువపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు.

ఓటు హక్కును వినియోగించుకోండి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శనివారం మండల పరిధిలో ఉన్న వంజంగి, గట్టుముడిపేట, సువ్వారిపేట తదితర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ ఇవీ రమణ, అధ్యక్షుడు పైడి సుజాత, లక్ష్మీనారాయణ, వీవోఏలు శ్రీదేవి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి


కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ గణేష్

శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటివి గొడవలు, ఘర్షణలు లేకుండా సజావుగా నిర్వహించుకుందామని వన్‌టౌన్ ఎస్‌ఐ బలివాడ గణేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం రాత్రి కొత్తపేటలోని ప్రజలతో ఎన్నికల నిర్వాహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో ఉన్న 18 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.